ప్రజాశక్తి

సోమవారం 12 ఆగస్టు 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ప్రయివేటు ఆసుపత్రుల్లో భద్రత ఎంత ?

◆ తరుచూ విశాఖ నగరంలో అగ్ని ప్రమాదాలు
◆ తాజాగా సెవెన్ హిల్స్‌లో ఘటన

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్


విశాఖ నగర పరిధిలోని ప్రయివేటు ఆసుపత్రుల్లో ఏడాదిగా వరుస అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోవడం భద్రతపై ప్రశ్నలు రేకెత్తి స్తున్నాయి. గత ఏడాది డిసెంబర్ 14న కెజిహెచ్ డౌన్‌లో ఉన్న ఇండస్ ఆసుపత్రిలో అగ్ని ప్రమాదం జరిగింది. రెండు వారాల క్రితం మెడికవర్ ఆసుపత్రిలోనూ, తాజాగా ఆదివారం సెవెన్‌హిల్స్ ఆసుపత్రిలోనూ ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. దీంతో విశాఖ నగరంలో ఎక్కడ చూసినా ఆసుపత్రుల్లో భద్రతపైనే చర్చ జరుగుతోంది.



సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న సిపి

అసలింతకీ సెవెన్స్‌హిల్స్‌లో ఏం జరిగింది..?

నగరంలోని రామ్‌నగర్ జంక్షన్‌లో ఉన్న సెవెన్‌హిల్స్ ఆసుపత్రిలో అగ్ని ప్రమాదం జరిగింది. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఆసుపత్రి ఆరో అంతస్తులో మంటలు రేగి, పొగలు రావడంతో ఆసుపత్రి సిబ్బంది అప్రమత్తమయ్యారు. వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే సూర్యాబాగ్, మర్రిపాలెం ప్రాంతాల నుంచి అగ్నిమాపక శకటాలు హుటాహుటిన అక్కడకు చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చాయి. ప్రమాద విషయం తెలిసి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అక్కడికి చేరుకొని సంఘటనా స్థలాన్ని నిశితంగా పరిశీలించారు. సూర్యాబాగ్ ఫైర్ స్టేషన్ అధికారి సింహాచలం మీడియాతో మాట్లాడుతూ ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం చోటుచేసుకుందని తెలిపారు. ఆరో అంతస్తులోని హెచ్‌ఆర్ విభాగం హెచ్‌ఒడి కార్యాలయంలో మిగతా 2లో..



మెడికవర్ ఆసుపత్రిలో ప్రమాదం జరిగిన చోటు (ఫైల్)



ఇండస్ ఆసుపత్రి నుంచి వెలువడుతున్న పొగ (ఫైల్)



దీక్షా శిబిరంలో నినదిస్తున్న స్టీల్‌ప్లాంట్ లేబర్ యూనియన్ నాయకులు

ఉక్కు ప్రైవేటీకరణతో మా పొట్ట కొట్టొద్దు

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించి, ఉపాధిని దెబ్బతీసి.. తమ పొట్ట కొట్టొద్దని స్టీల్‌ప్లాంట్ లేబర్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని కోరుతూ విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే దీక్షలు ఆదివారానికి 1229వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ లేబర్ యూనియన్ కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో ఉంటేనే తమ వంటి వారికి ఉపాధి లభిస్తుందన్నారు. శాశ్వత ఉద్యోగం అన్న ఆశా నెరవేరుతుందన్నారు.

ప్రైవేటీకరణ జరిగితే తమతో పాటు శాశ్వత ఉద్యోగులకు కూడా ఉపాధి లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటు యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తాయని అన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో బి.ఆనంద్, ఆర్.శ్రీను, బి.సోమేష్, ఎస్‌కె.షఫీ, వెంకట రమణ, చంద్రకళ, చాందిని, పి.సురేష్ పాల్గొన్నారు.

బుద్ధదేవ్ భట్టాచార్యకు ఘన నివాళి

▶ వార్త 4లో..

వైసిపికి రెహమాన్ గుడ్ బై.. ?

▶ వార్త 2లో..

వర్షాభావంతో వరి నారు విలవిల

▶ వార్త 5లో..

నాందేడ్ - శ్రీకాకుళం మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల అదనపు రద్దీని నియంత్రించేందుకు నాందేడ్ – శ్రీకాకుళం రోడ్ – నాందేడ్ మధ్య ప్రత్యేక రైళ్లను నడపాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఆ మేరకు 07487 నాందేడ్ – శ్రీకాకుళం రోడ్ ప్రత్యేక రైలు ఆగస్టు 14 మధ్యాహ్నం 14.00 గంటలకు నాందేడ్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.10 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 9.12 గంటలకు బయలుదేరి అదే రోజు మధ్యాహ్నం 12.00 గంటలకు శ్రీకాకుళం రోడ్డుకు చేరుకుంటుంది. 07488 శ్రీకాకుళం రోడ్ – నాందేడ్ ప్రత్యేక రైలు ఆగస్టు 15 సాయంత్రం 17.00 గంటలకు శ్రీకాకుళం రోడ్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 19.33 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 19.35 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 15.25 గంటలకు నాందేడ్ చేరుకుంటుంది.

ఆ ప్రత్యేక రైళ్లు నాందేడ్ – శ్రీకాకుళం మధ్య ముద్‌ఖేడ్, ధర్మాబాద్, బాసర, నిజామాబాద్, కామారెడ్డి, సికింద్రాబాద్, నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం, చీపురుపల్లి మీదుగా ప్రయాణిస్తాయి. ఈ ప్రత్యేక రైళ్ల సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ కోరారు.

కెజిహెచ్‌లో ప్రక్షాళన

◆ రోగులకు మెరుగైన సౌకర్యాలు ◆ విధి నిర్వహణలో అలసత్వం వహించేవారిపై చర్యలు
◆ ఫిర్యాదుల స్వీకరణకు కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు
◆ 'ప్రజాశక్తి'తో కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.శివానంద





ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్

ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయినిగా పేరొందిన కెజిహెచ్‌లో ఇకమీదట రోగులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా, రోగుల సహాయకులకు సమస్యలు తలెత్తకుండా ఆసుపత్రిని ప్రక్షాళన చేస్తామని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.శివానంద తెలిపారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ ధ్యేయమన్నారు. ఇటీవలే బాధ్యతలు చేపట్టిన ఆయన తనను కలిసిన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

కెజిహెచ్‌లో ఇటీవల పరిపాలన గాడి తప్పిందన్న విమర్శలపై ఏమంటారు ?

ఇది ఇంతవరకూ ఉన్న పరిస్థితి. యదార్థం కూడా. ఇకమీదట అలా ఉండదు. కెజిహెచ్‌లో అన్ని సమస్యలనూ ఒక్కొక్కటిగా పరిష్కరిస్తాం. ఈసరికే ప్రక్షాళన మొదలైంది. ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు, వసతి సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నాం. ప్రతి విభాగం నుంచి అవసరమైన అన్ని రకాల సమాచారాలనూ తీసుకొని వాటి ప్రకారం ఆసుపత్రి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాం.

వైద్యులు, నర్సింగ్ సిబ్బంది సమయపాలన పాటించడం లేదన్న విమర్శలపై ఏమంటారు ?

కొద్ది మంది బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న మాట నిజమే. సమయపాలన పాటించాలని, వైద్యులు, ఇతర సిబ్బంది డ్రెస్ కోడ్ తప్పక అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశాం. ఇక నుంచి వైద్యులు సమయపాలన పాటించకుంటే చర్యలు తీసుకుంటాం.

బయట ల్యాబ్ నుంచి వచ్చి కెజిహెచ్‌లో పరీక్షలు నిర్వహిస్తున్నారన్న వార్తలు నిజమేనా ?

కొందరు వైద్యులు నాకు ఈ విషయమై ఫిర్యాదు చేశారు. దీనిపై నిఘా పెట్టాం. ఎంత అత్యవసరమైనా అన్ని పరీక్షలూ కెజిహెచ్ ఆవరణలోనే జరిగేలా చర్యలు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ప్రయివేటు ఆసుపత్రుల్లో భద్రత ఎంత ?

ఉన్న ఫైల్స్ దగ్ధమయ్యాయని వెల్లడించారు. నాలుగు, ఐదు అంతస్తులలో పేషెంట్లు ఉన్నారని, ప్రమాదం జరిగిన వెంటనే వారందరినీ సురక్షిత ప్రదేశానికి తరలించారని తెలిపారు.

కొద్ది రోజుల క్రితం

రెండు వారాల క్రితం వెంకోజీపాలెంలోగల మెడికవర్ ఆస్పత్రిలో రాత్రి 11.30 గంటలు సమయంలో అగ్నిప్రమాదం సంభవించింది. సెల్లార్‌లోగల యుపిఎస్ బ్యాటరీలు పేలడంతో మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా పొగ వెలువడి సెల్లార్‌తో పాటు ఆసుపత్రి మొదటి, రెండు అంతస్తులు వరకూ కమ్మేసింది. దీంతో రోగులు, వారి బంధువులు ఆందోళన చెందారు.

నగర నడిబొడ్డున జగదాంబ జంక్షన్ సమీపంలో కెజిహెచ్ డౌన్‌లో ఉన్న ఇండస్ హాస్పిటల్‌లో గత ఏడాది డిసెంబర్ 14న ఉదయం 11 గంటల ప్రాంతంలో అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో అప్పటి వరకూ ఎంతో ప్రశాంతంగా ఉన్న ఆసుపత్రిలో హాహాకారాలు మిన్నంటాయి. ఏం జరుగుతుందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. రెండో అంతస్తులోని ఆపరేషన్ థియేటర్‌లో నైట్రస్ ఆక్సైడ్ లీకేజ్ కావడంతో జరిగిన ఈ ప్రమాదాన్ని గుర్తించిన వెంటనే ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు అప్రమత్తమయ్యారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసు, రెవెన్యూ సిబ్బంది హుటాహుటిన అక్కడ చేరుకున్నారు. సహాయక చర్యలను పకడ్బందీగా చేపట్టారు. దీంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 47 మంది రోగులు క్షేమంగా బయటపడ్డారు. రోగులలో 22 మందిని సమీపంలోని మెడికవర్ ఆసుపత్రికి, ఇద్దరిని కెజిహెచ్‌కు, మిగిలిన వారిని విజేత ఆసుపత్రికి నాడు తరలించారు. ప్రమాదంపై కలెక్టర్ ఐదుగురితో కూడిన విచారణ కమిటీని వేశారు.

విమర్శలివీ..

ఫైర్ సేఫ్టీ నిబంధనలను ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు పాటించడం లేదన్న విమర్శలు ఎప్పటి నుంచో ఉన్నాయి. సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ లోపించడంతో ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు భావిస్తున్నారు.

వెలమలకు అన్నింటా అన్యాయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వెలమ సామాజిక తరగతికి ఆర్థిక, సామాజిక రంగాలలో తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆంధ్రప్రదేశ్ వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లగుడు గోవిందరావు ఆరోపించారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన వెలమల ఆత్మగౌరవ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధికంగా వెలమలు ఉన్న ఉత్తరాంధ్రకు అన్నింటా అన్యాయం జరుగుతోందన్నారు. వెలమ సామాజిక తరగతికి బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని, నామినేటెడ్ పదవుల భర్తీలో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల సత్యం, కార్యదర్శి పెదిరెడ్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు వరద రాజ్ కుమార్, విశాఖపట్నం జిల్లా ఇన్‌ఛార్జి రెడ్డి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మెడికవర్‌లో కేన్సర్‌పై సమ్మిట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (వైజాగ్) ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ సర్జికల్ ఆంకాలజీతో కలిసి విశాఖపట్నంలోని మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కి చెందిన సర్జికల్ ఆంకాలజిస్ట్‌ల మొట్ట మొదటి సమావేశాన్ని ఎపి ఒఎన్‌సిఒ సమ్మిట్ - 2024 పేరిట ఆదివారం విశాఖపట్నంలో నిర్వహించింది. డాక్టర్ ఎస్‌విఎస్.దేవ్, ఐఎంఎ ప్రెసిడెంట్ డాక్టర్ పీజే శ్రీనివాస్, మెడికవర్ హాస్పిటల్స్ ఎపి రీజినల్ డైరెక్టర్ ఎన్.పద్మజ, మెడికవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ చీఫ్ కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ కార్తీక్ చంద్ర జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ ఎస్‌విఎస్ దేవ్ మాట్లాడుతూ సీనియర్ల మార్గదర్శకత్వంలో విజ్ఞానం, నైపుణ్యాలను పెంపొందించడానికి యువ, ఔత్సాహిక సర్జికల్ ఆంకాలజిస్టులకు ఈ రకమైన సమావేశం దోహదపడుతుందన్నారు. సదస్సు ఆర్గనైజింగ్ ఛైర్మన్ డాక్టర్ కార్తీక్ చంద్ర మాట్లాడుతూ కేన్సర్ చికిత్సలో శస్త్ర చికిత్స ఎంతో కీలకమని, సర్జికల్ ఆంకాలజిస్టులు ఈ రంగంలో సరికొత్త పురోగతులను అందిపుచ్చుకోవాలని అన్నారు. అందుకే కేన్సర్ రోగులకు చికిత్స చేయడంలో అత్యుత్తమ శస్త్ర చికిత్స ఆచరణలు ప్రదర్శిస్తూ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో భాగంగా వివిధ జాతీయ స్థాయి వక్తలు ముఖ్యమైన అంశాలపై ప్యానెల్ చర్చలతో పాటు కీలక నోట్ ఉపన్యాసాలు ఇచ్చారు. ఐఎంఎ సెక్రటరీ డాక్టర్ ఎంవిఎస్ఎస్ బాపారావు, ఎపిఎంసి అబ్జర్వర్ డాక్టర్ కె.శిల్ప, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ లాలిత్య స్వర్ణ పాల్గొన్నారు.

వైసిపి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : భార్యను, కన్నబిడ్డలను హింసిస్తున్న శ్రీకాకుళం జిల్లా టెక్కలికి చెందిన వైసిపి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను అరెస్ట్ చేయాలని విశాఖ యాత శెట్టి బలిజ గౌడ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ శ్రీనివాస్ తల్లి చేసిన కులదూషణను తీవ్రంగా ఖండించారు. మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డికి దమ్ముంటే వెంటనే దువ్వాడ శ్రీనివాస్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఒడిసెల సూరిబాబు, గెద్దాడ రమేష్, పోలవరపు శ్రీనివాసు, దొడ్డి రాజు, కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో విశాఖ మార్కెట్‌లోకి 'ఎంజి విండ్సర్'

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎంజి మోటార్స్ తమ ఇవి విభాగంలో మొదటి ఏరో-లౌంజ్ సీట్స్ ఫీచర్ కలిగిన భారతదేశపు ఫస్ట్ క్రాస్ ఓవర్ వాహనం ఎంజి విండ్సర్‌ను అతి త్వరలో విశాఖ మార్కెట్‌లోకి విడుదల చేయనుందని సంస్థ విశాఖపట్నం సేల్స్ హెడ్ జాన్సన్ తెలిపారు. బీచ్ రోడ్‌లోని ఎంజి షోరూమ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

వైసిపికి రెహమాన్ గుడ్ బై.. ?

టిడిపి, జనసేనల్లో చేరుతారని ఊహాగానాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరానికి చెందిన మాజీ ఎమ్మెల్యే, వుడా మాజీ ఛైర్మన్ ఎస్ఎ.రెహమాన్ త్వరలో వైసిపిని వీడనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. నగరంలోని ముస్లిముల నేతగా ఆయనకు పేరు. భార్య డాక్టర్ షిరీన్ రెహమాన్‌తో కలిసి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రారంభంలో తెలుగుదేశం పార్టీలో క్రియాశీలంగా ఉన్న ఆయన ఆ పార్టీ తరఫున 1994లో విశాఖ-1 నియోజవర్గం నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. అదే పార్టీలో ఉంటూ ఆ తర్వాత వుడా ఛైర్మన్‌గానూ పనిచేశారు. ఎమ్మెల్యేగా, వుడా ఛైర్మన్‌గా ఆయన బాగా పనిచేసినట్లు గుర్తింపు పొందారు. వుడా వేసిన లే అవుట్‌లో జర్నలిస్టులకు అందుబాటు ధరలో ఇళ్ల స్థలాలను కేటాయించారు. అనంతరం ఆయన తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షునిగా పనిచేశారు. 2009లో ఆ పార్టీ తరపున శాసనసభకు పోటీ చేయాలని భావించారు. అయితే టిక్కెట్ రాలేదు. అనంతర కాలంలో ఆయన టిడిపికి రాజీనామా చేశారు. 2009లో విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గం నుంచి రెహమాన్ సతీమణి డాక్టర్ షిరీన్ రెహమాన్ అసెంబ్లీకి పోటీ చేసి ఓటమి చెందారు. ప్రజారాజ్యం పార్టీలోనూ పనిచేశారు. ఆ పార్టీ కాంగ్రెస్‌లో విలీనం కావడంతో అనంతర పరిణామాలలో తిరిగి తెలుగుదేశం పార్టీలో చేరారు. 2014లో విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి పోటీ చేయాలని ఆయన భావించారు. ఆసారీ టిక్కెట్ రాలేదు. దీంతో మరలా టిడిపికి రాజీనామా చేశారు. అనంతరం 2019లో తన భార్యతో కలిసి వైసిపిలో చేరారు. ఆ పార్టీకి రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆ ఎన్నికల్లో ఆయనకు పోటీ చేసే అవకాశం ఆ పార్టీ నుంచి లభించలేదు. అయినప్పటికీ ఆ పార్టీలో కొనసాగారు. వైసిపి అధికారంలోకి వచ్చినప్పటికీ ఎటువంటి నామినేటెడ్ పదవీ రెహమాన్‌కు దక్కలేదు. అప్పటి నుంచి ఆయన ఆ పార్టీ కార్యక్రమాలకు ముఖం చాటేశారు. ఇక రాష్ట్రంలో ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రెహమాన్ కూడా తన రాజకీయ మనుగడ కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. గతంలో ప్రత్యర్థిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ వైసిపిలో కొనసాగుతుండటంతో టిడిపిలో చేరాలని రెహమాన్ భావిస్తున్నట్లుగా తెలిసింది. అదే సందర్భంలో గతంలో ప్రజారాజ్యం పార్టీలో పనిచేసిన అనుభవంతో జనసేన పార్టీలో చేరాలని కూడా ఆయన భావిస్తున్నట్లు కొందరు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో దక్షిణ జనసేన ఎమ్మెల్యే, ఆ పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షులు సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ ఇటీవల ప్రత్యేకంగా రెహమాన్ గృహానికి వెళ్లి ఆయనను సత్కరించి, రాజకీయ అంశాలపై చర్చించినట్లు తెలిసింది.

ఇది జరిగిన కొద్ది రోజులకే రెహమాన్ ప్రత్యేకంగా టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు గృహానికి వెళ్లి టిడిపి రాష్ట్ర అధ్యక్షునిగా ఆయన ఎన్నిక కావడం పట్ల హర్షం వ్యక్తపరిచారు. పల్లాను సత్కరించారు. అప్పుడు కూడా రాజకీయ చర్చ సాగినట్లు తెలిసింది. ఈ పరిణామాల నేపథ్యంలో రెహమాన్ టిడిపిలో చేరవచ్చని, ఆ పార్టీ నుంచి గ్రీన్ సిగ్నల్ లభించకపోతే జనసేనలో చేరే అవకాశాలున్నాయని పలువురు భావిస్తున్నారు.

ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రతి ఇంటిపై.. ప్రతి పౌరుడూ త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేయాలని, భారత స్వాతంత్ర్య సంబరాలకు స్ఫూర్తి కలిగించాలని జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్ విశాఖ నగర ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో భారత త్రివర్ణ పతాకాన్ని చేతబట్టి విశాఖ నగర ప్రజలకు స్ఫూర్తినిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారత దేశమంతా ఆగస్టు 9వ తేదీ నుండి 15 వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం జరుగుతోందన్నారు. విశాఖ నగర ప్రజలంతా ప్రతి ఇంటిపై భారత త్రివర్ణ పతాకం ఎగురవేస్తూ సెల్ఫీ ఫొటో తీసుకొని హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొని వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలని కోరారు.



జాతీయ జెండాతో కమిషనర్

https:// harghartiranga.com

యుటిటి నేషనల్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌కు అంపైర్‌గా శర్మ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (విశాఖపట్నం) డివిజన్‌లో పని చేస్తున్న బ్లూ బ్యాడ్జ్ ఇంటర్నేషనల్ అంపైర్ డివిఎస్‌వై.శర్మను సెప్టెంబర్ 11 నుంచి 18 వరకు హిమాచల్ ప్రదేశ్‌లోని రెయిన్ బో ఖేలో ఇండియా రెసిడెన్షియల్ అకాడమీలో జరగనున్న యుటిటి నేషనల్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్ షిప్ - 2024 పోటీలకు సాంకేతిక అధికారి (అంపైర్)గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఎల్ఐసి అధికారులు, ఎల్ఐసి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, ఎపి టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు.



కెజిహెచ్‌లో ప్రక్షాళన

(మొదటి పేజీ తరువాయి..)

తీసుకుంటాం.

సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది మాటేంటి ?

వారిపై ఫిర్యాదులు ఉన్నాయి. ప్రస్తుతం పనిచేస్తున్న వారికి తోడు నూతనంగా నియామకాలు చేపడతాం. 50 ఏళ్లు దాటిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకోవద్దని చెబుతాం. డ్రెస్ కోడ్ పక్కాగా అమలు చేస్తాం.

డెంగీ, డయేరియాపై అప్రమత్తంగా ఉన్నారా ?

డెంగీ, డయేరియాపై అప్రమత్తంగా ఉన్నాం. రోగులకు తక్షణ వైద్య సేవలు అందేలా పక్కా ఏర్పాట్లు చేశాం.

రోగుల ఇబ్బందులపై నేరుగా ఫిర్యాదు చేయొచ్చా ?

రోగులు, వారి బంధువులు, సహాయకులు వారికి తలెత్తే ఇబ్బందులను నేరుగా నా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయవచ్చు. అది లిఖితపూర్వక ఫిర్యాదు కానవసరం లేదు. ఇటువంటి ఫిర్యాదులు స్వీకరించి, ఎప్పటికప్పుడు వారి ఇబ్బందులను పరిష్కరించడం కోసం జిల్లా కలెక్టర్ ఆదేశం మేరకు ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశాం. ఫిర్యాదులు చేయవలసిన వారు 0891-2590100, 2590102 నెంబర్లను సంప్రదించాలి. ఆ ఫిర్యాదులు కలెక్టర్ ఆఫీసులో ఉన్న కంట్రోల్ సెంటర్‌కు, అలాగే కెజిహెచ్‌లో ఉన్న కంట్రోల్ సెంటర్‌కు వస్తాయి. అందరూ వినియోగించుకోవాలి.

బ్లడ్ రిపోర్టుల కోసం కొత్తగా ఏమైనా చర్యలు తీసుకున్నారా ?

రిపోర్టుల కోసం బ్లడ్ బ్యాంక్ వద్దకు ఇక నుంచి రావలసిన అవసరం ఉండదు. రక్త పరీక్షలు చేయించుకునే రోగులకు సంబంధించిన మొబైల్ నెంబర్ ఇస్తే సదరు రిపోర్టును వారికి వాట్సాప్‌లో పంపిస్తాం. మొబైల్ వినియోగించని రోగులు మాత్రమే రిపోర్టుల కోసం బ్లడ్ బ్యాంకు వద్దకు రావాల్సి ఉంటుంది.

జనన, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం పడుతున్న ఇబ్బందులను ఎలా పరిష్కరిస్తారు ?

ఇకమీదట ఆ ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశాం. సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ఆధార్ నెంబర్‌ను ఆధారం చేసుకుంటున్నాం. సరైన వివరాలు అందజేస్తే సర్టిఫికెట్లు సిద్ధం చేసి, అవసరమైన వారికి వెంటనే అందజేస్తాం.

మార్చురీ వద్ద లంచాల సంగతి మీ దృష్టికి వచ్చిందా ?

అటువంటి సమస్య ఉంటే నేరుగా నన్ను కలిసి ఫిర్యాదు చేయొచ్చు. ఎవరికీ ఆసుపత్రిలో డబ్బులు ఇవ్వవలసిన అవసరం ఉండదు.

ఉచిత అంబులెన్స్‌ల సదుపాయం ఉందా ?

ఏనాటి నుంచో ఈ సదుపాయం అమలులో ఉంది. అయితే కొందరికి తెలియక ప్రైవేట్ అంబులెన్స్‌లను మాట్లాడుకుంటున్నారు. సిఎస్ఆర్ నిధులతో ఇటువంటివి ఏర్పాటు చేస్తున్నాం. ప్రైవేటు అంబులెన్సులు కెజిహెచ్ పార్కింగ్ ప్రదేశంలో కొన్ని ఉంటున్నాయి. వాటిని తొలగించే చర్యలు తీసుకున్నాం.

వైద్యులు, సిబ్బందిపై రోగులు, వారి బంధువుల దాడులను నియంత్రించేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారు ?

ఆసుపత్రికి వచ్చిన రోగులు, వారి బంధువులు వైద్య సేవల విషయంలో ఏవైనా ఇబ్బందులు తలెత్తితే ఆ సమయంలో వైద్యులు, ఇతర సిబ్బందిపై దాడులు చేయడం మంచిది కాదు. వాటిని నివారించడం కోసం ప్రతి ఐసియు కేంద్రం వద్ద కౌన్సిలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. ప్రైవేటు ఆసుపత్రులు మాదిరిగా వీటిని ఏర్పాటు చేయడంతో పాటు రోగులను పరామర్శించేందుకు వారి సహాయకులకు పాసులు మంజూరు చేస్తున్నాం. ఉదయం, సాయంత్రం సందర్శన వేళలలో మాత్రమే అనుమతిస్తాం. మిగిలిన సమయంలో రోగుల సహాయకుల కోసం ఏర్పాటు చేసిన షెడ్లలో ఉండాల్సి ఉంటుంది. వారికి అన్ని రకాల వసతులు కల్పిస్తున్నాం. ఇప్పటికే ఆయా విభాగాల వైద్యులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. కౌన్సిలింగ్ కేంద్రాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేశాం.

వాహనాల పార్కింగ్ సమస్యపై ఏమంటారు ?

సమస్య పరిష్కారానికి ఈసరికే చర్యలు చేపట్టాం. పిల్లల వార్డు పక్కన ప్రత్యేకంగా పార్కింగ్ షెడ్ ఏర్పాటు చేశాం. ఇది మాత్రమే కాకుండా సిఎస్ఆర్ బ్లాక్ వద్ద కనీసం 500 వరకు వాహనాలు పార్కింగ్ చేసే ఏర్పాటు చేశాం. ఇక్కడ మెడికల్ కాలేజీ విద్యార్థులు వాహనాల పార్కింగ్ చేస్తున్నారు. ఇకమీదట అక్కడ వారు పార్కింగ్ చేయకూడదని చెప్పాం.



నిరాశ్రయులకు ఆహార పొట్లాలు అందజేస్తున్న యుటిఎఫ్ ప్రతినిధులు

అధ్వానంగా రోడ్లు.. ఆదమరిస్తే ప్రమాదాలే..



నీల కుండీలు నుంచి పద్మనాభం రోడ్డులో గుంతలు

ప్రజాశక్తి-యంత్రాంగం

ఆనందపురం : ప్రభుత్వం మారినా రహదారులకు మోక్షం కలగలేదు. ప్రయాణికులకు కష్టాలు తప్పలేదు. వర్షాలు పడితే చెరువులను తలపించేలా రహదారులు మారుతున్నాయి. నడిచి పొలం గట్లుపైనైనా వెళ్లిరావొచ్చుగానీ రహదారులపై వెళ్లిరాలేని దుస్థితి నెలకొంది. వాహనాలపై వెళ్లడానికి భయపడేలా రోడ్లపై పెద్దపెద్ద గుంతలున్నాయి. వీటినిండా నీరు చేరడంతో ఎక్కడ గుంత ఉందో తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

నీల కుండీలు నుంచి పద్మనాభం వయా చిన్నాపురం వరకు రోడ్డు పూర్తిగా శిథిలావస్థలా ఉంది. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. నీలకుండీల నుంచి గిడిజాల బాకురుపాలెం, రేగానిగూడెం, సిర్లపాలెం, బోని, పద్మనాభం, రెడ్డిపల్లి, చిన్నాపురం తదితర గ్రామాలను కలుపుకొని గతంలో వేసిన రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఏర్పడి అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రాత్రిపూట ఈ రోడ్డులో ప్రయాణించాలంటే భయపడుతున్నారు. 100 అడుగుల రోడ్డు ఏర్పాటుకు గత ప్రభుత్వంలో అధికారులు ప్రతిపాదనలు పంపినా నేటికీ అతీగతీ లేదు. భారీ ప్రమాదాలు జరగకముందే రోడ్డు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

ఈ విషయమై జెఇ బాలరాజును వివరణ కోరగా నీల కుండీల జంక్షన్ నుంచి చిన్నాపురం వరకు సుమారు 18 కిలోమీటర్ల మేర రోడ్డు మరమ్మత్తులు చేపట్టడానికి సుమారు రూ.ఆరు కోట్లతో ప్రతిపాదన చేసి కాశీ కనస్ట్రక్షన్‌కు పనులు అప్పగించామని తెలిపారు. ఫిబ్రవరి నెలలో పనులు ప్రారంభించి ఎన్నికల కోడ్ అమలులోకి రావడం వల్ల సుమారు 100 మీటర్లు పనులు చేపట్టి మధ్యలోనే నిలిపేశారని వివరించారు. ప్రస్తుతం బిల్లులు మంజూరు కాకపోవడంతో పనుల్లో జాప్యం జరుగుతుందని, త్వరలోనే పనులు ప్రారంభించి రోడ్లు పూర్తిస్థాయిలో ఏర్పాటుకు చర్యలు చేపడతామని తెలిపారు.

రెండేళ్లుగా రాళ్ల రహదారే..

పద్మనాభం : మండలంలోని అనంతవరం జంక్షన్ నుంచి అలమండ రైల్వే స్టేషన్ వరకు ఉన్న 5 కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా మారింది. రెండేళ్ల నుంచి రోడ్డు రాళ్లు తేలి ఉంది. ఈ రోడ్డు ప్రయాణానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో ఈ రోడ్డును వేసేందుకు పక్కా తారు రోడ్డు ఉన్న ప్రాంతాలను కూడా తవ్వేశారు. దీంతో రోడ్డు మొత్తం రాళ్లు తేలి ఉంది. ఇటీవల వర్షాలు కురవడంతో మెత్తగా ఉన్న బూడిద నీటితో కొట్టుకుపోయి పెద్దపెద్ద రాళ్లు తేలిపోయాయి. దీంతో ఈ రోడ్డుపై ద్విచక్రవాహనదారులు, సైకిళ్లపై వెళ్లేవారు తరచూ పడిపోతున్నారు. ఈ రోడ్డుపై పెంట, పి.కొవ్వాడ, కె.కొవ్వాడ, గంధవరం గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణం చేస్తూనే ఉంటారు. మద్దిలపాలెం డిపో నుంచి 541 నెంబర్ బస్సు కొత్తవలస మీదుగా కె.కొవ్వాడ, పి.కొవ్వాడ, పెంట, అనంతవరం, పద్మనాభం వరకు నడుస్తుంది. 222 నెంబర్ బస్సు మద్దిలపాలెం నుంచి తగరపువలస పద్మనాభం అనంతవరం మీదుగా కె.కొవ్వాడ వరకు రోజుకు రెండుసార్లు తిరుగుతోంది. ఈ రోడ్డులోనే అలమండ సంతకు పలు టాటా ఏసీలు, ఆటోలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రోడ్డు ప్రయాణం వల్ల టైర్లు పాడవుతున్నాయని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం మారినప్పటికీ ఈ రోడ్డు దుస్థితిని ఎవరూ పరిశీలించకపోవడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



అనంతవరం జంక్షన్ నుంచి అలమండ రహదారి

అనాథలకు యుటిఎఫ్ సాయం

ప్రజాశక్తి -తగరపువలస : యుటిఎఫ్ భీమిలి మండల శాఖ ఆధ్వర్యాన స్థానిక హైవే అండర్ పాత్, బస్టాప్ తదితర ప్రాంతాల్లో నిరాశ్రయులైన వృద్ధులకు, మతి స్థిమితం లేని వారికి ఆదివారం మధ్యాహ్నం ఆహార పొట్లాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు యుటిఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్మిక నేత ధర్మారెడ్డికి నివాళి

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జ్యూట్ కార్మిక నేత చిల్ల ధర్మారెడ్డి వర్ధంతి సభను స్థానిక జ్యూట్ మిల్లు కాంగ్రెస్ కార్మిక సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ధర్మారెడ్డి చిత్రపటానికి పలువురు కార్మిక సంఘం నాయకులు, జ్యూట్ కార్మికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు జెవి.కైలాష్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దల్లి అప్పలరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ, ధర్మారెడ్డి జ్యూట్ కార్మికుల హక్కుల సాధన కోసం చేసిన, నడిపిన పోరాటాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కుటుంబ సభ్యులు, కార్మిక సంఘం నాయకులు నీలాపు మనోహరరెడ్డి, శంకర రెడ్డి, జి.అప్పారావు, టి.కూర్మారావు, జి.రమణ, సిహెచ్.సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

కాలువలు నిర్మించండి

ప్రజాశక్తి -మధురవాడ : కాలువలు లేక మురుగునీరు రహదారిపై ప్రవహించడంతో ఆయా కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జివిఎంసి 7వ వార్డు పరిధిలోని పిలకవానిపాలెం నుంచి జాతీయ రహదారి వరకు రోడ్డుకిరువైపులా బహుళ అంతస్థులతో పాటు పలు నివాసాలు ఉన్నాయి. ఆ ఇళ్లకు సంబంధించిన వాడుక నీరు కాలువులు లేకపోవడంతో నిత్యం రహదారిపైనే ప్రవహిస్తోంది. అక్కడ ఈగలు దోమలు చేరడంతో పాటు దుర్వాసన వెదజల్లుతోంది. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదఆయా కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువలు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

హిందీ విద్యార్థులకు సర్టిఫికెట్లు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యాన ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన హిందీ ప్రాథమిక, మధ్యమ, రాష్ట్ర భాష, ప్రవేశికలో ఉత్తీర్ణులైన వారికి ఆదివారం సర్టిఫికెట్లు అందజేశారు. భీమిలిలో ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షులు కెఎస్‌ఆర్ కృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆదర్శ హిందీ ప్రేమీ మండలి గౌరవాధ్యక్షులు గంటా నూకరాజు హాజరై విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

పోలీస్ స్టేషన్‌కు హంగులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక పోలీస్ స్టేషన్ అవరణ చుట్టూరా నాటిన మొక్కలు ఆద్యంతం ఆహ్లాదాన్ని పెంచుతున్నాయి. పలు సమస్యలపై వచ్చే వారి కోసం సిమెంట్ బెంచీలు నిర్మించారు. పోలీస్ స్టేషన్ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.




ఆహ్లాదాన్ని పంచేలా మొక్కలు, సిమెంట్ బెంచీలు

18న భూలోక మాత పండగ

ప్రజాశక్తి-ఆనందపురం: ఆనందపురం హైస్కూల్ సమీపంలో ఉన్న భూలోక మాత అమ్మవారి పండగ ఈ నెల 18న నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆనందపురం బీపీ కల్లాలు, ఎల్‌వి.పాలెం, వేములవలస, పెద్దిపాలెం పరిసర గ్రామ ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

పాఠశాల అభివృద్ధికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని వెంకటాపురం ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధికి ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ రూ.లక్ష ఆర్థిక సాయం అందజేసినట్లు తెలుగుదేశం పార్టీ నాయకులు సుంకర శివ తెలిపారు. పాఠశాలలలో క్రీడా మైదానాన్ని ఇప్పటికే రూ.70 వేలతో చదును చేసి నిధులు చాలక పనులు మధ్యలో నిలిపేయడంతో సమస్యను ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి రూ.లక్ష సహకరించినట్లు చెప్పారు. ఆర్థిక సహాయం చేసిన ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్‌కు గ్రామస్తులు, విద్యార్థులు తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శొంట్యాం మాజీ వైస్ సర్పంచ్ కోరాడ శ్రీను, తెలుగుదేశం నాయకులు సుంకరి శివ, కొలగాని రమణ, దొంతల శ్రీరామ్ పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న సుభాష్ చంద్రబోస్

జూలో ప్రపంచ ఏనుగుల దినోత్సవం



చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో ప్రపంచ ఏనుగుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, పోస్టర్ ప్రదర్శన పోటీలు నిర్వహించారు. నగరంలోని వివిధ పాఠశాలల నుంచి సుమారు 120 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం ఏనుగుల పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా మాట్లాడుతూ, గజ రాజుల దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకోవడంతో పాటు నేటి యువతరానికి వాటి పరిరక్షణ కోసం అనుసరించాల్సిన విధానాలపై అవగాహన కల్పించడం సంతోషంగా ఉందన్నారు. దీనికి సహకరించిన ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ జి.మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్స్ గోపి, గోపాలనాయుడు, ఫారెస్ట్ అధికారులు భారతి, రాజేష్, జూ ఎడ్యుకేషన్ అఫీసర్ దివ్య తదితరులు పాల్గొన్నారు.

ఎఐటియుసి జాతీయ సమావేశాలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - ఆరిలోవ : సెప్టెంబరు 1, 2, 3 తేదీల్లో స్టీల్‌ప్లాంట్ గురజాడ కళా క్షేత్రంలో జరిగే ఎఐటియుసి జాతీయ సమితి సమావేశాలను జయప్రదం చేయాలని ఎఐటియుసి జిల్లా నాయకులు ఎస్‌కె.రహ్మాన్, కాసుబాబు పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా ఆదివారం ఎఐటియుసి ఆధ్వర్యాన ఆరిలోవ కాలనీ, చివరి బస్టాపు వద్ద జాతీయ సమావేశాల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు లక్ష్మణరావు, కె.వెంకట్రావు, ఎస్.సూరిబాబు, నారాయణ, వి.జగదీష్, ఎం.సంతోష్, ఎ.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : ఉక్కునగరంలోని గురజాడ కళాక్షేత్రంలో సెప్టెంబర్ 1, 2, 3 తేదీల్లో ఎఐటియుసి జాతీయ సమితి సమావేశాలు జరుగనున్నాయని ఆ యూనియన్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి, జాతీయ సమితి సమావేశాల ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె అచ్యుతరావు తెలిపారు. పెద గంట్యాడలోని పోతిన సన్యాసిరావు భవన్‌లో ఆదివారం ఆహ్వాన సంఘం సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ సమితి సమావేశాల బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కసిరెడ్డి సత్యనారాయణ, కె.రాజబాబు, జి.ఆనంద్, యెల్లేటి శ్రీనివాస్, కెంగువ అచ్యుతరావు, తాండ్ర కనకరాజు, పల్లేటి పోలయ్య, కె.పోతన్న, పి.దుర్గారావు, అప్పారి విష్ణుమూర్తి, మాధవరావు, సోమేష్, కె.వనజాక్ష్మి పాల్గొన్నారు.

అవయవదానంపై 13న అవగాహన సదస్సు

ప్రజాశక్తి - అరిలోవ : ప్రపంచ అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని విఎంఆర్‌డిఎ సమావేశ మందిరంలో ఏపీ జీవనధాన్ సంస్థ ఆధ్వర్యాన ఈ నెల 13న అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఏపీ జీవనదాన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్, విమ్స్ డైరక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. ఈ అవగనాన కార్యక్రమానికి కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్, జివిఎంసి కమిషనర్ పి.సంపత్‌కుమార్, జెసి అశోక్ కుమార్, విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ పాల్గొంటారని తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటలకు ఎయు అవుట్ గేటు నుంచి విఎంఆర్‌డిఎ చిల్డ్రన్ ఏరీనా వరకు వాక్‌థాన్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నగర ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభంలో వంశీకృష్ణ, పల్లా తదితరులు

విశాఖ ఆర్థిక రాజధానిగా అభివృద్ధి

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ ఆర్థిక రాజధానిగా అభివృద్ధి సాధిస్తుందని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. సీతమ్మపేట రాజేంద్రనగర్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన జన సేన పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదలు, పార్టీ వర్గాలకు ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు ఇక్కడ నాయకులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రధాని మోడీ సహకారంతో చంద్రబాబు రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. విశాఖ అభివృద్ధికి బాటలు వేస్తున్నామని, భోగాపురం ఎయిర్ పోర్టు, పోలవరం ప్రాజెక్టు సాకారం కానున్నాయని తెలిపారు. పవన్ కల్యాణ్ ఆశయాల సాధనకు కృషి చేస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికలో కూటమి విజయం ఖాయమన్నారు. పోర్టు కాలుష్య నివారణకు, దక్షిణంలో రైతు బజార్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు.

డైరెక్టర్ మెహర్ రమేష్ మాట్లాడుతూ, సినిమా రంగంలో విశాఖ ఎంతో అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, గణబాబు, నాయకులు తాతారావు, ఉషాకిరణ్, సీతంరాజు సుధాకర్, శివకుమార్‌రెడ్డి, ప్రశాంతి, కార్పొరేటర్లు బీసెట్టి వసంతలక్ష్మి, సాధిక్, గోవిందరెడ్డి, బుజ్జి, సురేష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

రౌడీలు సత్ప్రవర్తనతో మెలగాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : రౌడీలు సత్ప్రవర్తనతో మెలగాలని నాలుగో పట్టణ ఎస్ఐ వెంకట్రావు సూచించారు. స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వివాదాలు, సెటిల్మెంట్‌లో ఉండకుండా తమ పనులు చూసుకోవాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాలయ్యశాస్త్రి లే-అవుట్‌లో వినాయకరాట

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 14వ వార్డు పరిధి సీతమ్మధార బాలయ్య శాస్త్రి లే-అవుట్‌లో ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన వినాయక ఉత్సవాల పందిరి రాటను వేశారు. ఈ కార్యక్రమంలో వికెపిసిపిఐఆర్ యుడిఎ మాజీ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు, వార్డు కార్పొరేటర్ కటారి అనిల్ కుమార్‌రాజు, రాజాన రాజు, అసోసియేషన్ సభ్యులు నాగరాజు, నాయుడు, అజయ్, ప్రతాప్, మురళి పాల్గొన్నారు.

దుర్వాసన మధ్య వ్యాయామ పార్కు

ప్రజాశక్తి -మధురవాడ : అధికారులు అలసత్వం వల్ల లక్షలాది రూపాయలు వృథా కానున్నాయి. జివిఎంసి 8వ వార్డు పరిధి మిధిలాపురి వుడాకాలనీ నుంచి వాంబే కాలనీకి వెళ్లే దారిలో ఎన్జీజీవోస్ కాలనీ వద్ద మురుగునీరు ప్రవహించే రెండు ప్రధాన గెడ్డల మధ్య జివిఎంసి వ్యాయామ పార్కును ఏర్పాటుచేస్తున్నారు. వివిధ కాలనీల నుంచి వచ్చే మురుగు నీరు కాలువలు ద్వారా వచ్చి ఇక్కడ రెండు గెడ్డల నుంచి ప్రధాన గెడ్డను కలుస్తుంది. వాటి నుంచి తీవ్ర దుర్వాసనలు వెదజల్లుతున్నాయి. ఆలాంటి చోట సుమారు రూ.40 లక్షలు వెచ్చించి పార్కు నిర్మించడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా జనావాసాల మధ్య కాకుండా నిర్మానుష్య ప్రదేశంలో పార్కు అభివృద్ధి చేస్తూ ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఆహ్లాదకరంగా, ప్రశాంతమైన వాతావరణంలో వ్యాయామం చేసేందుకు ప్రజలు ఇష్టపడతారని, దుర్వాసన మధ్య ఎవరు చేస్తారని ప్రశ్నిస్తున్నారు. దీనిపై స్థానిక ప్రజా ప్రతినిధులు, జివిఎంసి ఉన్నతాధికారులు పున:పరిశీలించాలని పలువురు కోరుతున్నారు.



మురుగు గెడ్డ పక్కనే ఏర్పాటుచేసిన వ్యాయామశాల

బుద్ధదేవ్ భట్టాచార్యకు ఘన నివాళి



బుద్ధదేవ్ భట్టాచార్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న జగ్గునాయుడు, ఈశ్వరమ్మ తదితరులు

ప్రజాశక్తి -యంత్రాంగం

ములగాడ : పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య సంతపసభ మల్కాపురం సిపిఎం కార్యలయంలో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్యదర్శివర్గ సభ్యులు బి.ఈశ్వరమ్మ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ, నిబద్ధత, నిరాడంబరం గల నేత బుద్ధదేవ్ అన్నారు. 2000 నుంచి 2011 వరకు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించి ప్రజలకు అనేక సేవలందించి వారి హృదయాల్లో ధన్యజీవిగా నిలిచారని కొనియాడారు. యువకుడి నుంచే కమ్యూనిస్టు ఉద్యమాల్లో నాయకత్వం వహించారని తెలిపారు. కళా సాహిత్య రంగంలో ఆయనది ప్రత్యేక స్థానమని కొనియాడారు. బుద్ధదేవ్ ఆశయాల సాధనలో మనమంతా నడవాలని పిలుపునిచ్చారు. ఈ సంతాప సభలో మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, మద్దిలపాలెం జోన్ కార్యదర్శి కృష్ణారావు, సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.ఈశ్వరమ్మ, మల్కాపురం జోన్ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, కె.పెంటారావు, ఆర్.విమల, డివైఎఫ్ఐ నాయకులు ఎస్.వాసు, రామకృష్ణ, ప్రశాంత్ సమీరు లెనిన్, సురేష్, గంట దాసు, రాంబాబు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్యకు హరిపాలెం గ్రామంలో ఆదివారం సిపిఎం నాయకులు ఘన నివాళులు అర్పించారు. బుద్ధదేవ్ చిత్రపటానికి సీనియర్ నాయకుడు శరగడం కనుమ నాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భట్టాచార్య పార్టీకి, పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ కాండ్రేగుల రామ సదాశివరావు, రైతు సంఘ జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, బుద్ధ రంగారావు సొంటేనా బ్రహ్మాజీ, పెంటకోట అప్పారావు, జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి బి రామ్ కుమార్ పాల్గొన్నారు.



హరిపాలెంలో బుద్ధదేవ్ భట్టాచార్యకు నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

గోపాలపట్నం పోలీస్‌స్టేషన్‌లో సిపి ఆకస్మిక తనిఖీలు



గోపాలపట్నం స్టేషన్ సిబ్బందికి సూచనలిస్తున్న సిపి శంఖబ్రత బాగ్చీ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: గోపాలపట్నం పోలీసు స్టేషన్‌ను నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో సిబ్బంది ప్రవర్తిస్తున్న తీరు, వచ్చిన ఫిర్యాదులపై పరిష్కరిస్తున్న తీరును పరిశీలించారు, అనంతరం స్టేషన్ మొత్తం నిశితంగా పరిశీలించారు. స్టేషన్‌ను ఆనుకొని ఉన్న ఖాళీ ప్రాంతాలను వ్యర్థాలతో నింపకుండా, శుభ్రం చేయించి మొక్కలు నాటాలని ఆదేశించారు. స్టేషన్ లోపల మొత్తం పరిశీలించారు. స్టేషన్‌తో పాటుగా మరుగుదొడ్లను ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు, స్టేషన్‌లో ఎల్లవేళలా తగు సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. పెండింగ్ కేసులు తక్షణం పరిష్కరించాలన్నారు. అన్ని రిజిస్టర్లు ఎల్లవేళలా అప్‌డేట్‌గా ఉండాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులకు మర్యాద ఇస్తూ వారిని కూర్చోబెట్టి సమస్యలను వినాలని, వాటిని పారదర్శకముగా విచారణ చేసి త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. క్రైమ్ పోలీస్ స్టేషన్ అవరణలో ఉన్న సీజ్ చేయబడిన, వినియోగంలో లేని వాహనాలు పాడవకుండా తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

స్టేషన్ పరిధిలోని అన్ని సెక్టర్లలో ఎటువంటి దొంగతనాలు, అసాంఘిక చర్యలూ జరగకుండా క్రైమ్ పోలీసులు పోలీసింగ్ చేయాలని, సీసీటీవీ కెమెరాలు మరిన్ని వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్ల ప్రతి కదలికనూ ఎల్లవేళలా పరిశీలించాలనీ, గంజాయి రవాణాదారులను అరెస్టు చేయాలనీ, స్టేషన్ల పరిధిలో ఒక్క గంజాయి పెడ్లర్ కూడా ఉండరాదని స్పష్టమైన అదేశాలు జారీ చేశారు. విధులలో ఎటువంటి అధికార దుర్వినియోగానికి పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

పలువురికి అవార్డులు

ప్రజాశక్తి-సీతమ్మధార : తెలుగు రాష్ట్రాల్లో వేర్వేరు రంగాలకు సంబంధించి 39 మంది ప్రతిభావంతులకు ప్రతిభ క్రీడా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యాన పౌర గ్రంథాలయంలో ఆదివారం అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా జివిఎంసి మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రతిభావంతులకు పురస్కారాలు అందజేయడం అభినందనీయమన్నారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ, పురస్కారాలు మరింత బాధ్యతను పెంచుతాయన్నారు. రెండు దశాబ్దాలకుపైగా క్రమం తప్పకుండా పురస్కారాలు అందిస్తున్న నిర్వాహకుడు అడవిరాజును అతిథులు ప్రశంసించారు. లక్ష్మీ స్వరూప వ్యాఖ్యానం చేసిన సభలలో చెన్నా తిరుమలరావు, సన్ మూర్తి, భాస్కభట్ల సత్యప్రసాద్ శర్మ, నాంచారయ్య, మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహంపై దాడి హేయం

ప్రజాశక్తి-సీతమ్మధార : విజయవాడలో నిర్మించిన అంబేద్కర్ మహాశిల్పంపై దుండగులు దాడి చేయటాన్ని నవయానం బహుజన సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి వెంకటరమణ తీవ్రంగా ఖండించారు. నగరంలోని బుల్లయ్య కాలేజీ సమీపంలోని అంబేద్కర్ భవన్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఘటన జరిగి మూడు రోజులు అవుతున్నా దుండగులను అరెస్టు చేయలేదంటే అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. విజయవాడ నగరం నడిబొడ్డున పోలీస్ కమిషనర్ ఆఫీస్, గవర్నర్ బంగ్లా, కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న విగ్రహానికి రక్షణ కల్పించలేని దారుణమైన స్థితి రాష్ట్రంలో ఉందన్నారు.

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేరు ఉన్న శిలా ఫలకం ధ్వంసంగానే ఈ చర్యను చూడలేమని, రాజ్యాంగ నిర్మాతపై దాడిగా భావించాలని పేర్కొన్నారు. దుండగులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.ధర్మారావు, ఎస్ఎ.రావు, వై.నూకరాజు, ఆర్ఎస్. నారాయణ, ఎస్.నూకరాజు, ఎం.అప్పారావు, పెయ్యల సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

'ఆదర్శంగా 65వ వార్డు'

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 65వ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అందరి సహకారం అవసరమని వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు అన్నారు. ఇటీవల తెలుగుదేశం పార్టీలో చేరిన ఆయనను వార్డులోని కార్యకర్తలంతా ఆదివారం కలిసి అభినందనలు తెలియజేశారు. పుష్ప గుచ్ఛాలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వార్డు అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. కూటమి కార్యకర్తలందరినీ కలుపుకొని వార్డులో అభివృద్ధి పనులు చేస్తానని చెప్పారు. తాను అధికారంలోకి వచ్చిన ఈ మూడేళ్లలో రాజకీయాలకతీతంగా పనులు చేపట్టానని గుర్తు చేశారు. దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని ఇటీవల ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును, జివిఎంసి కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు. త్వరలో కార్యకర్తలందరితో సమావేశం ఏర్పాటు చేస్తానన్నారు. కార్యక్రమంలో వార్డు టిడిపి అధ్యక్షులు రట్టి వాసు, జయమ్మ, అంగకృష్ణ, దాట్ల శ్రీనివాసరాజు, పోతిన వెంకటేశ్వరరావు, సిగటాపు సుజాత, కోరుకొండ మంగ, సమ్మిడి ఉమ, కొట్టిన శ్రీలక్ష్మి, రట్టి సంతోష్, యాదగిరి ప్రసాద్, వియ్యపు విశేష, ఒడిశిల ఈశ్వరరావు, కనకాల త్రినాథ్, చిన్న, విల్లా శివ, కోటి, శివంగి నాగేశ్వరరావు, కొయ్య గురుమూర్తి, కెవిఎస్ ప్రసాద్, పంతులు శివ, బాబులు, కొలపాక సతీష్ తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేటర్‌ను సన్మానిస్తున్న కార్యకర్తలు

విద్యార్థినులతో ఊడిగం చేయిస్తున్న కుక్

- చోడవరం బిసి హాస్టల్ వద్ద బాలికల ఆందోళన
- సంఘీభావం తెలిపిన ఎస్ఎఫ్ఐ, సిఐటియు నేతలు
- హాస్టల్‌లో పరిస్థితులు చక్కదిద్దాలని డిమాండ్



ఆందోళన చేస్తున్న చోడవరం బిసి హాస్టల్ విద్యార్థినులు

ప్రజాశక్తి- చోడవరం/ చోడవరం రూరల్: చోడవరం బిసి బాలికల హాస్టల్‌లో హెడ్ కుక్ పార్వతి ఆగాడాలు భరించలేని విద్యార్థినులు ఆదివారం హాస్టల్ ముందు ఆందోళన నిర్వహించారు. హాస్టల్‌లోని విద్యార్థినులను బాలకార్మికులుగా మార్చి, హాస్టల్‌లోని పనులతోపాటు సొంతం పనులు చేయిస్తున్నారని, మెనూ ప్రకారం భోజనం పెట్టక వేధింపులకు గురిచేస్తున్నారంటూ విద్యార్థినులు ఆందోళన చేస్తున్న సమాచారం తెలుసుకున్న సిఐటియు జిల్లా కార్యదర్శి గునూరు వరలక్ష్మి అక్కడికి చేరుకొని పరిశీలించారు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను వారిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆందోళనకు సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా హాస్టల్ వార్డెన్ మెతక వైఖరిని ఆసరాగా చేసుకుని, అన్నీ తానై కుక్ పార్వతి పెత్తనం చెలాయిస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు, స్నానపు గదులకు తలుపులు లేవు, డ్రైనేజీలు, గార్డెన్‌తోపాటు మరుగుదొడ్లను విద్యార్థులే శుభ్రపరచుకోవాలి. ప్రతిరోజు విద్యార్థులే తెల్లవారి నాలుగు గంటలకు లేచి 9,10 వ తరగతి పిల్లలు ఇడ్లీకి మినపగుళ్ల రుబ్బుకోవడం నూక కలుపుకోవడం, ఇడ్లీ పెట్టుకోవడం వంటి పనులు చేయాలి, పూరీలుచేసినా, ఇంకేం టిఫిన్ అయినా విద్యార్థులే వండి తినాల్సిన దుస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. హెడ్ కుక్ పార్వతి విద్యార్థినులతో వంట, హాస్టల్‌లో పరిశుభ్ర పనులే కాకుండా, తన కాళ్లు పట్టించుకోవడం, సరిగా పట్టకపోతే కాళ్లతో తన్నటం, వినకపోతే కర్రలతో వాళ్ళని కొట్టడం,తొడల్లో గిల్లడం చేస్తుందని విద్యార్థులు ఆవేదన వెలిబుచ్చారు. 5వ తరగతి, ఆరవ తరగతి పిల్లలను ఇంటికి పంపించి అక్కడ అన్ని పనులు చేయిస్తున్నారని విద్యార్థినులు ఏడుస్తూ చెబుతున్నారు. ఇన్ని పనులు చేసి స్కూల్‌కు వెళ్లేసరికి మొదటి పీరియడ్‌కు చేరుకోకపోవడంతో మాస్టార్లు పదేపదే మందలిస్తున్నారని, హాస్టల్‌లోనైతే పనులు చేస్తే వదలడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్లో కనీస సౌకర్యాలు లేకపోగా నాణ్యమైన భోజనం కూడా పెట్టడం లేదని బాలికలు ఆవేదనను వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి హాస్టల్‌లో నెలకొన్న పరిస్థితులను చక్కదిద్దాలని సిఐటియు జిల్లా కార్యదర్శి గూనూరు వరలక్ష్మి కోరారు. విద్యార్థినులతో ఊడిగం చేయించుకోవడమే కాకుండా, వారిని ఇష్టానుసారంగా బయటకు చెప్పుకోలేని మాటలు అంటూ మానసికక్షోభకు గుర్తు చేస్తున్న కుక్ పార్వతి, ఇతర సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించకుంటే ఆందోళన తీవ్రం చేస్తామని ఎస్ఎఫ్ఐ, సిఐటియు నేతలు హెచ్చరించారు.

రోడ్డు అంచుల్లో తుప్పల తొలగింపు



జంగిల్ క్లియరెన్స్ పనుల్లో డివైఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి -రాంబిల్లి : మండలంలో కొత్తపట్నం నుంచి వాడ నరసాపురం వచ్చే మార్గంలో రోడ్డుకు రోడ్డుకు ఇరువైపుల ఉన్న పిచ్చిమొక్కలను డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం శ్రమదానంతో తొలగించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చింతకాయల శివాజీ, రాంబిల్లి మండల కార్యదర్శి ఎన్ నారాయణరావు, మాట్లాడుతూ కొత్తపట్నం నుండి వాడనర్సాపురం గ్రామాల మధ్యలో రోడ్డుకి ఇరువైపులా పెద్ద ఎత్తున తుప్పలుపెరిగి, రోడ్డును కమ్మేయడంతో రాకపోకలు సాగించే వాహనదారులు అనేక ఇబ్బందులు గురవుతున్నారన్నారు. దీన్ని దృష్టిలో యాత కొత్తపట్నం డివైఎఫ్ఐ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో రోడ్డుపై ఉన్న పిచ్చిమొక్కలు తొలగించే పనులు చేపట్టారు. డివైఎఫ్ఐ అంటే యువత సమస్యలపై పోరాటాలే కాదు, ఇలా సేవా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో శ్రీను, అప్పలరాజు, వెంకటేష్ మరియు డివైఎఫ్ఐ మాజీ నాయకులు, జి. దైముడు నాయుడు పాల్గొన్నారు.

బాలకార్మికులతో పని చేయించడం నేరం

ప్రజాశక్తి - యలమంచిలి : 14 ఏళ్ల లోపు పిల్లల్ని పనుల్లో పెట్టుకోవడం, బాల కార్మికులతో పనిచేయించడం చట్టరీత్యా నేరమనిస్థానిక లేబర్ ఆఫీసర్ సుంకర వెంకటేశ్వరరావు హెచ్చరించారు. దుకాణాలు, హోటళ్లు, కర్మాగారాల్లో, ఇళ్లల్లో పిల్లల్ని పనులకు పురిగొల్పడంపై ప్రజల్లో అవగాహనకు ఎల్ఐసి కార్యాలయం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 14 ఏళ్లలోపు చిన్నారులంతా పాఠశాలల్లోనే ఉండాలని, వారిని పనిలో పెట్టుకున్న వారు ఎంతటివారైనా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కాకతాంబనగర్‌లో క్రికెట్ అకాడమీ ప్రారంభం



క్రికెట్ అకాడమీ ప్రారంభిస్తున్న రాంకీ

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక డైట్ కళాశాల సమీపంలో కాకతాంబనగర్‌లో ఎస్‌విఎల్ క్రికెట్ అకాడమీ ఆదివారం ప్రారంభమైంది. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదేశాల మేరకు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమరశెట్టి రాంకీ పాల్గొని అకాడమీని ప్రారంభించారు. అక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాంకీ మాట్లాడుతూ, విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరచిన వారికి ఎల్లప్పుడూ ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. భవ్యశ్రీ డెవలపర్స్ అధినేత కాండ్రేగుల నాయుడు మాట్లాడుతూ క్రికెట్‌ను ప్రోత్సహించేందుకు పేద విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలనే ఆలోచన అభినందించదగ్గ విషయమన్నారు. అకాడమీ వ్యవస్థాపకుడు ఆడారి సతీష్‌ను అభినందించారు. విద్యార్థులు జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనకాపల్లికి ప్రత్యేక గుర్తింపు వచ్చే విధంగా క్రీడాకారులు తమ ప్రతిభను కనబరచాలని పిలుపునిచ్చారు. అనంతరం అకాడమీ వ్యవస్థాపకుడు సతీష్ మాట్లాడుతూ క్రికెట్‌లో పేద, ధనిక తారతమ్యం లేకుండా క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు ఇక్కడ శిక్షణనిస్తామన్నారు. అనంతరం రాంకీని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కర్రి మహాలక్ష్మినాయుడు, రవి, స్వర్ణ జ్యూయలర్స్ బుద్ధ శ్రీను, కర్రి నర్సింగరావు, యువకులు పాల్గొన్నారు.

వర్షాభావంతో వరి నారు విలవిల

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : ఈ ఏడాది ఖరీఫ్‌లో వాతావరణ పరిస్థితులు ఆదిలోనే ప్రతికూలంగా ఉండడంపై అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. పదిరోజుల క్రితం వరకు అతివృష్టి వర్షాలతో రైతులు ఇబ్బందులు పడగా, ఇపుడు పదిరోజులుగా చినుకు రాలకపోవడంతో వరినారుమళ్లు ఎండిపోయే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తొలినాళ్లలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు నారుమళ్లలో నీరు నిలిచిపోయి మొలకెత్తడం మానేశాయి. అప్పుడు కొంతమంది రైతులు మళ్లీ వరి విత్తనాలు కొని చల్లారు. ఇపుడు పదిరోజులుగా వర్షాలు ఎత్తిపెట్టడంతో మొదట్లో మొలకెత్తిన వరినారు ఇపుడు కొనవాడిపోతోందని వాపోతున్నారు. వర్షాలు కురువక మండలంలో బంగారుమెట్ట, బుచ్చయ్యపేట దిబిడి, కండిపూడి తదితర గ్రామాల్లో వరినారుమళ్లు ఎండి పోవడంతో ఏం చేయాలో పాలు పోక రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వేసవిని తలపించే విధంగా భానుడు భగభగ మండుతుండడంతో అటు వరినారుమళ్లు ఎండిపోవడంతోపాటు ఇటు ఉక్కపోతతో ప్రజల సైతం విలవిల్లాడిపోతున్నారు.



బంగారుమెట్టలో ఎండిపోయిన వరి నారుమడి

కేరళ వరద బాధితులకు విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న విసిసి, ఐద్వా ప్రతినిధులు, నేతలు

ప్రజాశక్తి -ఆనందపురం: కేరళ వరద బాధితులకు వైజాగ్ చిల్డ్రన్ క్లబ్, ఐద్వా నాయకులు కె.నాగరాణి ఆధ్వర్యాన ఆదివారం విరాళాలు సేకరించారు. ఆనందపురం భూలోక మాత గుడి సమీపంలో శ్రమజీవులు కాలనీలో విద్యార్థులతో నాగరాణి ఇంటింటికీ వెళ్లి విరాళాల సేకరించారు. కాలనీవాసులు స్వచ్ఛందంగా విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ, కేరళ రాష్ట్రం వయనాడ్ ప్రకృతి విలయానికి అతలాకుతలమైందని, అక్కడి ప్రజల సహాయార్థం విరాళాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ విరాళాలను కేరళ సిఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో దొంతల వరలక్ష్మి, శ్రీహర్ష కల్యాణ్, చాందిని, యశ్వంత్, చాణిక్య రిసి, నితిన్, ఝాన్సీ, సరస్వతి కాలనీ విద్యార్థులు పాల్గొన్నారు.

వడ్డాది : కేరళ వయనాడ్‌లోని వరద బాధితులకు అండగా సిపిఎం మండల శాఖ అధ్యక్షుడు పినపాత్రుని సాంబశివరావుఆధ్వర్యంలో బుచ్చయ్యపేట మండలం వడ్డాది, బంగారు మెట, ఎల్బీపీ అగ్రహారం గ్రామాల్లో ఆదివారం విరాళాలు సేకరించారు వచ్చిన విరాళాలు మొత్తాన్ని కేరళ ప్రభుత్వానికి సిపిఎం తరపున అందజేస్తామన్నారు. పార్టీ కార్యకర్తలు, యువకులు, అభిమానులు పాల్గొన్నారు



వడ్డాదిలో విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నేతలు

వికలాంగుల ఆశ్రమానికి నిత్యావసరాలు



నిత్యావసరాలు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి -అచ్యుతాపురం: 'పీపుల్ వెల్ఫేర్ అసోసియేషన్ కనెక్ట్' అనే స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు బ్లేస్సీ యశస్వినిఆధ్వర్యంలో అచ్యుతాపురంలో వికలాంగుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఆదివారంనిత్యవసర సరుకులు వితరణ చేశారు. ఈ సందర్భంగా వికలాంగ విద్యార్థులకు ఆటపాటలు నిర్వహించారు. కెజిహెచ్ డాక్టర్ విజయ్‌కుమార్, స్టాఫ్ నర్స్ రత్నకుమారి ఆధ్వర్యంలో విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ విద్యార్థులుకు నిత్యవసర సరుకులు, బియ్యం, నూనె, కందిపప్పు తదితర వస్తువులను జాతీయ అవార్డు గ్రహీత, ఆశ్రమ నిర్వాహకులు పిఎస్‌టి పట్నాయక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వికలాంగులకు వివిధ సేవా కార్యక్రమాలు అందిస్తున్న పట్నాయక్ అభినందనీయుడని కొనియాడారు.

తమ సంస్థకు సహాయ సహకారాలు అందజేసిన పీపుల్ వెల్ఫేర్ అసోసియేషన్ కనెక్ట్ సంస్థకు పట్నాయక్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పీపుల్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను కనెక్ట్ సలహాదారుడు గోవింద, సంస్థ సభ్యులు లోకేష్ నాయక్, ప్రీతి, అనిత, ల్యాబ్ టెక్నీషియన్ వంశీ పాల్గొన్నారు.

సామ్రాట్‌కు అంబేద్కర్ సేవారత్న అవార్డు



అంబేద్కర్ సేవారత్న అవార్డు స్వీకరిస్తున్న సామ్రాట్

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అమృతపురం గ్రామానికి చెందిన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అనకాపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోటువాడ సామ్రాట్ కుమార్‌కు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జాతీయ సేవారత్న అవార్డు లభించింది. విశాఖపట్నం పౌర గ్రంథాలయంలో ప్రతిభ క్రీడ,సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో వివిధ సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు చేసిన వారిని గుర్తించి అవార్డులు ప్రదానం చేశారు. అందులో భాగంగా సామ్రాట్ కుమార్‌కుజాతీయ సేవా రత్న అవార్డు దక్కింది. అవార్డుతోపాటు సత్కారం పొందిన సామ్రాట్ కుమార్ మాట్లాడుతూతనకు అవార్డు ఇచ్చిన ప్రతిభ సంస్థకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్‌లో సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ , జాతీయ జర్నలిస్ట్‌ల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఆదినారాయణ, చెంగల చిన్నారావు పాల్గొన్నారు.

సెలవు రోజుల్లో కాలేజీల నిర్వహణ తగదు

ప్రజాశక్తి - యలమంచిలి : యలమంచిలిలో కొన్ని ప్రైవేటు కాలేజీల్లో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా సెలవు దినాల్లో క్లాసులు నిర్వహిస్తున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక ఎస్ఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆర్ఐఒను కలిసి ఫిర్యాదు చేశారు.. సెలవు రోజుల్లో కూడా క్లాసులు నిర్వహణతో విద్యార్థులు ఒత్తిడికి గురౌతున్నారన్నారు. రెండవ శనివారం, ఆదివారం, ఇతర సెలవు రోజుల్లో క్లాసులు నిర్వహణపై ఆయా కాలేజీల యాజమాన్యాలను హెచ్చరించినట్లు యలమంచిలి ఎస్ఎఫ్ ఐ నేతలు కె.మణికంఠ, వై.గని అన్నారు. అయినప్పటికీ వారి తీరులో మార్పు లేకపోవడంతో, అధికారులే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నేతలు కోరారు. పి.కృప, సిహెచ్ లక్ష్మణ్, ఎం మణి, యు.మూర్తి, కె.శివ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి

మండల అధ్యక్షునిగా కపిసెట్టి



కపిసెట్టి వెంకటరమణ

ప్రజాశక్తి- దేవరాపల్లి: ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మరిశర్ల మాలతి కృష్ణమూర్తి నాయుడు, రాష్ట్ర అధ్యక్షులు జాగరపు ఈశ్వరప్రసాద్ ప్రతిపాదనతో అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ధరిమిశెట్టి నారాయణరావు సూచనలమేరకు మాడుగుల అసెంబ్లీ, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ దేవరాపల్లి మండల అధ్యక్షులుగా తెలుగుపూడి గ్రామానికి చెందిన కపిసెట్టి వెంకటరమణను నియమిస్తూ ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి రఘుసత్య సింహచక్రవర్తి ప్రకటించారు. దీనిపై వెంకటరమణకు తెలుగుపూడి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభినందనలు తెలిపారు

పిచ్చి కుక్క కాటుతో పలువురికి గాయాలు

ప్రజాశక్తి -కశింకోట : కశింకోట మండలంలో తాళ్ళపాలెం సంతకు చెందిన కుప్పిని దేముడమ్మ, కుప్పిని అశ్విని, బల్లా ఈశ్వరమ్మ, ఉగ్గిని పాలెం కె. సూర్య కాంతం,ఎ.మాణిక్యం, లాలం కొత్తూరు దేముడమ్మ ఆదివారం పిచ్చికుక్క కాటుకు గురయ్యారు వీరిలో కొంతమంది తాళ్ళపాలెం ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేశారు, మరి కొంతమంది ప్రైవేట్ ఆసుపత్రి లో చికిత్స చేయించు కున్నారు. కుక్కను పోలవరం కాలువ గట్టు వద్ద కర్రలతో కొట్టి హతమార్చారు. ఇదే కుక్క పలు మేకలను కరిచి గాయపరిచింది

జలజీవన్ మిషన్ పనుల్లో నాణ్యతాలోపం

పర్యవేక్షణాలోపంతో ఇష్టారాజ్యంగా పనులు : సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న



దేవరాపల్లిలో జరుగుతున్న జలజీవన్ మిషన్ పైపులైను పనులు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలకేంద్రంలో జలజీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికి కుళాయిల పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న విమర్శించారు. దేవరాపల్లిలో జరుగుతున్న పనులను పరిశీలించిన తర్వాత విలేకర్లతో మాట్లాడుతూ, జలజీవన్ మిషన్ పనుల్లో పర్యవేక్షణాలోపం, ముడుపులకు కక్కుర్తిపడి, కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నా పట్టించుకోని సంబంధిత అధికారుల నిర్వాహకం వల్ల పనుల్లో నాణ్యత చెడుతోందని ఆరోపించారు. వాటర్ ట్యాంకు నిర్మాణ పనులు జరుగుతున్నా, వాటికి వాటరింగ్ చేయడం లేదని, పైపులైన్ పనులు సరిగా సాగకపోవడం వల్ల భవిష్యత్‌లో కుళాయిలకు సక్రమంగా నీరు వచ్చే పరిస్థితి లేదన్నారు. తొందరగా పనులు పూర్తి చేసి, చేతులు దులుపుకునే క్రమంలో యంత్రాలతో ఇష్టారాజ్యంగా అవసరానికి మించి తవ్వకాలు చేపట్టడంతో రోడ్లు పూర్తిగా దెబ్బతింటున్నాయని అంటున్నారు. పైపులైన్‌కు తీస్తున్న గోతులతో సిసి రోడ్లు, డ్రైనేజీలు దెబ్బతిన పాడౌతున్నాయని అఉన్నారు. సంబంధిత అధికారులు స్పందించి పనులు నాణ్యతగా, క్రమబద్ధంగా జరిగేలా చర్యలు చేపట్టాలని వెంకన్న కోరారు.

ఎస్‌సి కాలనీ సమస్యలను పరిష్కరించాలి



సమస్యలు తెలుసుకుంటున్న కళ్యాణి

ప్రజాశక్తి-అనకాపల్లి: మండలంలోని గొలగం పంచాయతీ ఎల్లారమ్మ ఎస్‌సి కాలనీలో సమ్యలను తక్షణమే పరిష్కరించాలని ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు పెదపాటి కళ్యాణి డిమాండ్ చేశారు. ఆదివారం కాలనీని సందర్శించారు. ఈ. సందర్భంగా పెదపాటి కళ్యాణి మాట్లాడుతూ గొలగం ఎల్లారమ్మ ఎస్సీ కాలనీలో 200 కుటుంబాలు నివసిస్తున్నాయని, 40 సంవత్సరాల నుంచి రోడ్లు డ్రైనేజీలు మంచినీటి సదుపాయం లేక ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో రోడ్ల పనులకు నిధులు మంజూరైనా అధికారులు పట్టించుకోకపోవడంతో అరకొర పనులు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారని ఆరోపించారు వర్షాలు పడితే ఇక్కడ మట్టి రోడ్లు చాలా దారుణంగా తయారై ప్రజలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. దీనిపై ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఎంపీ సీఎం రమేష్, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, యువ నాయకుడు దాడి రత్నాకర్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ వెంటనే స్పందించి ఈ ఎస్సీ కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు, వాటర్ మంజూరు చేయాలని కోరారు. గతంలో నిధులు మంజూరైనా రోడ్డు పనులు నిర్లక్ష్యంగా ఆపేసిన అధికారులపై జిల్లా కలెక్టర్ తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి పిల్లల శంకర్, జిల్లా కార్యదర్శి సిమ్మా శ్రీనివాస్, ఎస్సీ కాలనీ వార్డ్ మెంబర్ గుబులు నూకరత్నం, సంతోష్ కుమార్, శర్మ, ఎల్లారమ్మ ఎస్సీ కాలనీ గ్రామ ప్రజలు పెద్దలు పాల్గొన్నారు.

143 మందికి ఉచిత వైద్యసేవలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-దేవరాపల్లి: మండలంలోని వాలాబు గిరిజన పంచాయితీలో సంఘమిత్ర రూరల్ డెవలప్మెంట్ సొసైటి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. వైద్య శిబిరంలో 143 మంది వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరానికి వచ్చిన వారికి బిపి, షుగర్ తో పాటు వివిధ రకాల వ్యాధులతో వచ్చిన వారికి అక్కడే వారికి టెస్టులు చేసి వారికి అవసరమయ్యే మందులను అందజేశారు. హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్న వారికి ఐరన్ సిరప్ లు అందజేశారు. కార్యక్రమంలో వైద్య నిపుణులు బండారు రామచంద్రరావు, సందీప్, శ్రీ చక్ర, అనూష, కావ్య వైద్య బృందంవైద్య పరీక్షలు చేశారు. సెక్రటరీ బొంతు మంగపతిరావు, బివి రమణమూర్తి, సూరెడ్డి బాబురావు, ఎం మురళీకృష్ణ, ఎల్ వి నారాయణ రావు, బి. గోవిందబాబు, వై గోవిందకుమార్, అమ్మ ఛారిట బుల్ ట్రస్ట్ చైర్మన్ వెంకట్రావు, కె. దండుమ నాయుడు, స్థానిక సర్పంచ్ పోడెల వెంకటలక్ష్మి, బుజ్జి పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి



శిక్షణ ప్రారంభంలో మాట్లాడుతున్న అప్పలనాయుడు

ప్రజాశక్తి-కశింకోట : ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కసిరెడ్డి అప్పులనాయుడు కోరారు. ఆదివారం మండలంలోని తాళ్ళ పాలెం గ్రామంలో శ్రీ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్ లో ఉచిత శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి బ్యాచ్‌లో 40 రోజులు శిక్షణ ఉంటుందన్నారు. మహిళలు క్రమశిక్షణతో, పట్టుదలతో శిక్షణలో పాల్గొని తర్ఫీదు పొందాలన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటికే 30 మంది మహిళలు తమ పేర్లు నమోదు చేసుకున్నారన్నారు.కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా ఇంచార్జ్ అన్నం శివ రాజశేఖర్, సేవా దళ్ కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యస్వామి, శిక్షకులు నాగమణి, హేమ కన్వీనర్ డాక్టర్ వెంకటరావు పాల్గొన్నారు.

వైసిపికి భారీ షాక్

జనసేనలో చేరిన మునగపాక ఎంపిపి, వైస్ ఎంపిపి, రాజుపేట సర్పంచ్

యలమంచిలి, అచ్యుతాపురంలో ఇద్దరు ఎంపిటిసిలు, పలువురు నేతలు కూడా..



ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంపిపి, వైస్ ఎంపిపి

ప్రజాశక్తి- మునగపాక: మండలంలో వైసిపికి మరో షాక్ తగిలింది. కొద్దిరోజుల క్రితమే వైస్ ఎంపీపీ చిందాడ దేవి ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సమక్షంలో జనసేనలో చేరగా, అదే బాటలో ఆదివారం ఎంపిపి మళ్ల జయలక్ష్మి, వైస్ ఎంపిపి భోజలక్ష్మి, రాజుపేట సర్పంచ్ కిలాడి దేవుళ్ళు, చెర్లోపాలెం ఉపసర్పంచ్ భోజ వెంకట శ్రీనివాసరావు తదితరులు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సమక్షంలో జనసేనలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి విజయ్‌కుమార్ సాదరంగా జనసేనలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జనసేనలో చేరిన ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మంచి విజన్‌తో ఈ రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని ఆశాభావంతో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సమక్షంలో జనసేనలో చేరామన్నారు. ఎలమంచిలి నియోజకవర్గంతో పాటుగా, మునగపాక మండలాన్ని ఎమ్మెల్యే సుందరపు అభివృద్ధిపథంలో నడిపిస్తారని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఈ నెల 12న సోమవారం మండల సర్వసభ్య సమావేశం జరగనుండగా ఎంపిపి, వైస్ ఎంపిపితో సహా పలువురు జనసేనలో చేరడం పలువురిని విస్మయపరిచింది. కార్యక్రమంలో మండల తెలుగుదేశం, జనసేన పార్టీల అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురాం, నాగవరం ఎంపిటిసి పాలిపిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన వైసిపి ఎంపిటిసి

అచ్యుతాపురం : రాంబిల్లి మండలానికి చెందిన వైసిపి ఎంపిటిసి జనపరెడ్డి దేవుళ్ళు, తాతాజీ, బాబ్జి, లక్ష్మీ, వడ్డుకాసులు సన్యాసిరావు, రత్నం, చిన్న తదితరులు ఆదివారం అచ్యుతాపురంలోని ఎస్‌టిబిఎల్‌లో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ స్వగృహంలో, ఆయన సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి స్వాగతం పలికారు.కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు, నాయకుడు పప్పుల నూకన్న దొర పాల్గొన్నారు.

యలమంచిలి : ఏటికొప్పాక ఎంపిటిసి నగిరెడ్డి అచ్చినాయుడు ఆదివారం జనసేనలో చేరారు. యలమంచిలి మండలంలో వైసిపికి ఉన్న ఏడుగురు ఎంపిటిసిల్లో ఒకరు మరణించగా, మిగిలిన ఆరుగురిలో ఇప్పటికే ఉన్న ఇద్దరు వైస్ ఎంపిపిలు పురుషోత్తపురం శేషు, జంపపాలెం ఉమ జనసేన తీర్థం పుచ్చుకున్న సంగతి తెల్సిందే. కొత్తలి ఎంపిటిసి బర్రె శివలక్ష్మి కూడా జనసేనలో చేరారు. ఇప్పుడు మరో ఎంపిటిసి నగిరెడ్డి అచ్చినాయుడు కూడా పార్టీ మారడంతో వైసిపి మైనారిటీ పడింది.

జగనన్న కాలనీకి దారేదీ?

మార్గం లేక ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రాని లబ్ధిదారులు

ప్రజాశక్తి- కోటవురట్ల

మండలంలో జల్లూరు గ్రామంలో గత ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన జగనన్న కాలనీకి దారి లేకపోవడంతో లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకునేందుకు ముందుకు రాలేదు. గ్రామం నడిబొడ్డునే సర్వే నెంబర్ 122లో 0.50 ఎకరాల భూమిని ప్రభుత్వం 20 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసింది. ఈ స్థలంలో సుమారు 21 మందికి లబ్ధిదారులను సైతం ఎంపిక చేసింది. ఈ కాలనీకి వెళ్లేందుకు దారి లేకపోవడంతో లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టేందుకు ఎవరు ముందుకు రాలేదు. దీంతో కొనుగోలు చేసిన భూమి గడిచిన ఐదు సంవత్సరాలుగా వృధాగా దర్శనమిస్తుంది. పలుమార్లు లబ్ధిదారులు అధికారులకు, నాయకులకు మొం పెట్టుకున్నా ఉపయోగలేకుండా పోయిందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ కాలనీకి వెళ్లేందుకు పరిసర ప్రాంతాల్లో రైతుల నుంచి దారికి స్థలం కొనుగోలు చేయాల్సి ఉంది. కాలనీకి వెళ్లే దారి నిమిత్తం సుమారు ఎకరంన్నర వరకు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అధికారులు ముందుచూపు లేకుండా కాలనీ స్థలాన్ని కొనుగోలు చేయడం పట్ల స్థానికులు, లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మార్గం లేకుండా ఎలా కట్టుకోవాలని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీకి వెళ్లేందుకు మార్గం ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న జగనన్న కాలనీ స్థలం

పుస్తక పఠనంతో విజ్ఞానం



నక్కపల్లిలో పుస్తక పఠనం చేయిస్తున్న గ్రంథాలయాధికారి

ప్రజాశక్తి-నక్కపల్లి: పుస్తక పఠనంతో మేధస్సు పెంపొందుతుందని గ్రంథాలయ అధికారి జనార్ధన్ తెలిపారు. మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు అవసరమైన కథలు, జనరల్ నాలెడ్జ్, స్పోకెన్ ఇంగ్లీష్, స్ఫూర్తి దాతల జీవిత చరిత్ర పుస్తకాలను అందుబాటులో ఉంచారు. విద్యార్థులతో పుస్తకాలను చదివించారు. నీతి కథలు చదివించి, నీతిని తెలియజేశారు. విద్యార్థులు ప్రతిరోజు పుస్తక పఠనం చేసే అలవాటును అలవర్చుకోవాలన్నారు. ప్రతి ఆదివారం గ్రంథాలయంలో చిల్డ్రన్స్ క్లబ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గొలుగొండ: విద్యార్థులు పుస్తక పఠనంను అలవాటు చేసుకోవాలని గొలుగొండ శాఖ గ్రంథాలయాధికారి రాజుబాబు సూచించారు. ఆదివారం గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థుల చేత పుస్తకాలను చదివించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటి నుంచే గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని చెప్పారు.



గొలుగొండలో చదువుతున్న విద్యార్థులు

మందకొడిగా వరి సాగు పనులు


- వర్షం కోసం ఎదురుచూపు
- ఆందోళనలో అన్నదాతలు



ప్రజాశక్తి-నక్కపల్లి: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి నాట్లు మందకొడిగా కొన సాగుతున్నాయి. వరి నాట్లు వేసేందుకు వరి ఆకు సిద్ధంగా ఉన్నప్పటికీ, వర్షాలు సమృద్ధిగా లేక పోవడంతో వరి నాట్లు ముందుకు సాగడం లేదు.

మండలంలోని ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 4400 ఎకరాల సాధారణ విస్తీర్ణంలో రైతులు వరి సాగు చేయనున్నారు. వర్షాలు సరిగ్గా పడక పోవడంతో ఇప్పటి వరకు 919 ఎకరాల్లో మాత్రమే వరి నాట్లు పడ్డాయి. బంగారమ్మపేట, గునుపూడిలో 110 ఎకరాలు, అమలాపురం, నెల్లిపూడిలో 11, ఎన్ నరసాపురం, చందనాడల్ 5, చిన దొడ్డిగల్లు 135, దోసలపాడు, ముకుంద రాజుపేటలో 160, జానకయ్యపేట 3, దేవవరం 80, డొంకాడ 165,గొడిచెర్ల 145,గుల్లిపాడు 50,కాగిత 2,పెద దొడ్డిగల్లు 20,ఉద్దండపురం 20, ఉపమాక 10, వేంపాడులో 3 ఎకరాల్లో మాత్రమే రైతులు వరి నాట్లు వేసారు.ఈ నాట్లు కూడా రైతులు అష్ట కష్టాలు పడి వేయవలసి వచ్చింది .

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జూన్ నెలలో రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీ చేశారు. అప్పట్లో సకాలంలో వర్షాలు కురవడంతో రైతులు వెనువెంటనే వరి నారుమడులను సిద్ధం చేసుకుని వరి ఆకు కోసం వరి విత్తనాలు జల్లారు. జులై మొదటి వారంలో వర్షాలు ముఖం చాటేయడంతో రైతులు వర్షాల కోసం చూసే పరిస్థితి ఏర్పడింది. నీటి సౌకర్యం ఉన్న ప్రాంతాల్లో రైతులు వరి ఆకు రక్షించుకునేందుకు తడులు పెట్టారు. అప్పుడప్పుడు కురిసిన వర్షాలకు వరి ఆకుకు ఊపిరినిచ్చాయి. దీంతో, మండలంలోని అన్ని గ్రామాల్లోనూ వరి నాట్లు వేసేందుకు వరి ఆకు సిద్ధమైంది. జులై నెలాఖరులో తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి ఈ గ్రామాల్లో వరి మడుల్లో వర్షపు నీరు వచ్చి చేరింది. దీనికి తోడు చెరువులో ఉన్న నీటిని పొలాలకు పెట్టి ఆయా గ్రామాల్లో రైతులు వరి నాట్లు వేశారు. ఇంకా సుమారుగా 3400 ఎకరాల వరకు వరి నాట్లు పడాల్సి ఉంది. వర్షాలు లేక పోవడంతో రైతులు వర్షం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. వర్షం కురిస్తే వరి నాట్లు ముమ్మురంగా చేపట్టేందుకు రైతులు సమయాత్తం అవుతున్నారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని ఉద్దండపురం జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం ప్రమాదవశాత్తు కారు డివైడర్ ను ఢీకొంది. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. రాజమండ్రి నుంచి వైజాగ్ వెళ్తున్న కారు ఉద్దండపురం వద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీని తప్పించబోయే క్రమంలో కారు అదుపుతప్పి డివైడర్ ను ఢీకొంది. ఈ కారులో ముగ్గురు ప్రయాణిస్తున్నారు. వారంతా క్షేమంగా బయటపడ్డారు. కారు దెబ్బతింది.



బుక్ లెట్‌ను ఆవిష్కరిస్తున్న అంగన్‌వాడీలు

హామీలను అమలు చేయాలి

ప్రజాశక్తి- పాడేరు: 42 రోజుల అంగన్వాడీల సమ్మె చారిత్రాత్మకమైందని ముద్రించిందని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాగ్యలక్ష్మి తెలిపారు ఆదివారం పాడేరు సిఐటియు కార్యాలయంలో యూనియన్ జిల్లా నాయకులతో కలిసి ముద్రించిన బుక్‌లెట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు 42 రోజుల సమ్మె ఎంతో పట్టుదలతో నిర్వహించారని, అందుకు ప్రభుత్వం దిగి వచ్చి డిమాండ్ల పరిష్కారానికి రాతపూర్వకంగా హామీ ఇచ్చిందని తెలిపారు. ఇప్పుడు అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం అంగన్వాడి ఒప్పందాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సహాయ కార్యదర్శి పెంటమ్మ, ఉపాధ్యక్షులు రాజమ్మ, కొండమ్మ, సత్యవతి పాల్గొన్నారు.

ఊట గెడ్డ నీరే గిరిజనులకు గతి

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండలంలోని కరిముక్కి పుట్టు గ్రామపంచాయతీ పరిధి నందిమెట్ట గ్రామంలో ఊట గెడ్డ నీరే గతిగా గిరిజనులకు మారింది. గ్రామంలో ఆదివాసి గిరిజన తెగకు చెందిన పివిటి జి(ఫోర్జ) కులస్తులు సుమారు 45 కుటుంబాలలో 130 మంది జీవనం సాగిన్నున్నారు. తాగునీటి సమస్యతో అనేక అవస్థలకు గురవుతున్నారు. గ్రామ సమీపంలోని ఊట గెడ్డలో గత 20 సంవత్సరాల క్రితం నుండి తాగునీరు వాడుతున్నామని ఆ గ్రామం మహిళలు వెచ్చంగి తుల్లమ్మ, పాంగి జొమ్ము, కొర్ర లక్ష్మిలు ఆవేదన వ్యక్తం చేశారు.



గెడ్డలో నీటిని మోసుకెళు తున్న మహిళలు

గ్రామ సమీపంలో గ్రావిటీ పథకాన్ని గత ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటికీ పొలం ఒడ్డున మట్టి బెడ్డలు పడి గ్రావిటీ మరమత్తులకు గురైంది. అయినా ప్రభుత్వం, అధికారులు, ప్రజా ప్రతినిధులు ఏ మాత్రం స్పందించలేదని మహిళలు వాపోయారు. ఎన్నికల సమయంలో గ్రామాలలో ప్రచారాలు చేయడమే తప్ప ప్రజా సమస్యలపై ప్రజాప్రతినిధులు చిత్త శుద్ధితో వ్యవహరించడం లేదని విమర్శించారు. అనేక దపాలు సచివాలయ కేంద్రంలో తాగునీటి సమస్యపై వినతులిచ్చినప్పటికీ అధికారుల్లో చలనం లేదన్నారు. గత్యంతరం లేక ఊట గెడ్డ నీరు తెచ్చుకుంటున్నామన్నారు.

ఏళ్లు గడుస్తున్నా.. పూర్తికాని నిర్మాణాలు

- ఆనాడు ప్రారంభించిన టిడిపి.. పనులు నిలిపేసిన వైసిపి
-అసంపూర్తిగా మేజర్ గోకులాలు
- కూటమి ప్రభుత్వమైనా పరిష్కరించేనా ?

ప్రజాశక్తి-కోటవురట్ల: ఉమ్మడి ఆంధ్ర విడిపోయిన తరువాత ఏర్పడ్డ తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రారంభించిన మేజర్ గోకులం నిర్మాణాలకు మోక్షం కలగలేదు. గ్రామీణ ప్రాంతాలలో పాడి రైతులపై ఆధారపడి జీవిస్తున్న వారి సంఖ్య అధికం కావడంతో ప్రభుత్వం వారికి ఊరట ఇచ్చేందుకు నాటి తెలుగుదేశం ప్రభుత్వం 2014లో పాడిపై ఆధారపడి జీవిస్తున్న భూమిలేని రైతుల పశువులకు మేజర్ గోకులం పేరుతో వసతి సౌకర్యాలు కల్పిస్తూ ఆర్థికంగా భరోసా ఇచ్చేందుకు వీటి ఏర్పాటుకు నిర్ణయించింది.



కొడవటిపూడిలో నిలిచిన నిర్మాణం

మండలంలో చిన్నబొడ్డేపల్లి, కొడవటిపూడి గ్రామాలలో పశువులకు వసతి సౌకర్యం కల్పించేందుకు రెండు కేంద్రాల ఏర్పాటు చేయదలిచారు. దాని నిమిత్తం ఒక్కో కేంద్రానికి సుమారు 15 లక్షల వరకు అంచనాలు రూపొందించారు. రెండు కేంద్రాల వద్ద కూడా దాదాపుగా పనులు మొదలుపెట్టి లింటల్ లెవెల్ వరకు నిర్మాణాలు చేపట్టారు. మేజర్ గోకులం వద్ద పశువులకు మేత, వసతి సహా పశు వైద్యుల పర్యవేక్షణలో అందించేందుకు సన్నాహాలు చేశారు.



చినబొడ్డేపల్లిలో పిల్లర్ల స్థాయిలో నిలిచిన నిర్మాణం

2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం అటువైపు కన్నెత్తి కూడా చూడక పోవడంతో నిర్మాణాలు చేపట్టిన కేంద్రాలు అర్థాంతరంగా నిలిచి పోవడంతో వృథాగా దర్శనమిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో 2024 కూటమి ప్రభుత్వం రాకతో పాడి రైతుల్లో ఆశలు చిగురుతున్నాయి. ఈ ప్రభుత్వంమైనా మేజర్ గోకులాల నిర్మాణాలు పూర్తి చేస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఇకెవైసి చేసుకోవాలి

ప్రజాశక్తి - చీడికాడ: ఉపాధి పనికి వెళ్లే ఉపాధి కూలీలు ఇకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏపీవో నాగరాజు తెలిపారు. మండలంలో 23 పంచాయితీలలో ఆధార్ ఇకేవైసీ లేక 33 మంది జాబ్ కార్డులకు సుమారు 116 మందివి రిజెక్ట్ అయినట్టు నాగరాజు తెలిపారు కూలీలు సరైన సమయంలో ఆధార్ ఈకేవైసీ చేయించుకోక పోవడంతో ఉపాధి హామీ జాబ్ కార్డులు రిజెక్ట్ అయినట్టు తెలిపారు.ప్రతి ఒక్కరు కూడా ఆధార్ సీడింగ్ చేయించుకోవాలని ఆయన తెలిపారు.ఈ సంవత్సరం గృహ నిర్మాణ పథకం ద్వారా 36 మందికి జాబ్ కార్డులు కొత్తవి విడుదల చేసినట్లు వాటి ద్వారా సుమారు 66 మంది లబ్ధి పొందినట్లు ఆయన తెలిపారు.



ఎపిఒ నాగరాజు

మాదక ద్రవ్యాల అనర్థాలపై నేడు నర్సీపట్నంలో ర్యాలీ

- సివిల్ జడ్జి షియాజ్ ఖాన్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం మున్సిపాలిటీ ఎన్టీఆర్ స్టేడియం నుంచి ఈ నెల 12న మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో మారక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పట్టణంలో వివిధ కళాశాలల విద్యార్థులకు, ప్రజలకు అవగా హన కల్పించడానికి భారీ ర్యాలీ నిర్వహించడం జరగనుందని సివిల్ జడ్జి పి.షియాజ్ ఖాన్ తెలిపారు. ఈ ర్యాలీ ఉదయం ఉదయం 9 గంటలకు స్థానిక ఎన్టీఆర్ స్టేడియం నుంచి ప్రారంభమౌ తుందన్నారు. ర్యాలీలో నర్సీపట్నం బార్ అసోసియేషన్ లాయర్లు, కళాశాలల విద్యార్థులు పాల్గొనాలన్నారు.



బాధిత కుటుంబానికి స్పందన సాయం



బాధితునికి ఆర్థిక సాయం అందిస్తున్న సిఐ

ప్రజాశక్తి-నక్కపల్లి: రోడ్డు ప్రమాద బాధితుల కుటుంబానికి స్పందన చేయూత ఫౌండేషన్ ఆర్థిక సహాయం అందజేసి ఔదార్యం చాటుకున్నారు. నక్కపల్లికి చెందిన పెదపూడి కిరణ్ కుమార్ కుటుంబం గత ఏడాది మే నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమారుడిని కోల్పోయి, తనతో పాటు భార్య, కుమార్తెకు తీవ్ర గాయాలు పాలై కుటుంబం విచ్ఛిన్నమయ్యింది. ఇప్పటికీ కిరణ్ కుమార్ ఇంటి వద్దే కదలలేని స్థితిలో ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న స్పందన చేయూత ఫౌండేషన్ (విశాఖపట్నం) మరికొంత మంది మిత్రులు కలిసి 36 వేల 500లు నగదు, ఒక నెలకు సరి పడే నిత్యావసర సరుకులను ఆదివారం బాధిత కిరణ్ కుమార్ కుటుంబానికి సీఐ విజయ్ కుమార్, లయిన్ ఆలపాటి సుబ్బారావు చేతుల మీదుగా అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని నింపారు. ఈ సందర్భంగా సిఐ విజయ్ కుమార్ ఫౌండేషన్ సేవలను ప్రశంసించారు. మరింతగా సేవలను విస్తరించాలని కోరారు. లయిన్ ఆలపాటి సుబ్బారావు మాట్లాడుతూ నక్కపల్లి మండలం లో ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ ఈపూరి బుచ్చిరాజు, బిశెట్టి శివాజీ, రాజేశ్వరరావు, అమరలింగేశ్వరావు, యచేంద్ర, దవరసింగి రాంబాబు పాల్గొన్నారు.

13న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-కోటవురట్ల: విద్యుత్ సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగించుకోవాలని మండల విద్యుత్ శాఖ అధికారి మహేష్ తెలిపారు. ఆదివారం అయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఈనెల 13న నర్సీపట్నం రూరల్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఏర్పాటు కానున్న విద్యుత్తు సమస్యల పరిష్కార వేదిక ద్వారా వ్యవసాయ, గృహ విద్యుత్ వినియోగదారుల సమస్యలు ఏమైనా ఉంటే తెలియజేయాలని సూచిం చారు. జిల్లా స్థాయి అధికారులు, సిజిఆర్ఎఫ్ చైర్ పర్సన్ సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు హాజరు కానున్నారన్నారు.



చెత్తను తొలగింపజేస్తున్న సెక్రటరీ

చెత్త కుప్పల తొలగింపు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని చోద్యం పంచాయతీ వీధుల్లో ప్రధాన రహదారి పక్కన, సచివాలయ సమీపంలో ఎట్టకేలకు చెత్త కుప్పలను సెక్రటరీ రమణ తొలగించారు. ఇక్కడ చెత్త పేరుకుపోవడంతో ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు పడేవారు. దీంతో ప్రజలు ఆవేదనకు గురయ్యారు. ఆదివారం చెత్తను ఎత్తించి శుభ్రం చేయించారు.

13,14 తేదీల్లో కేన్సర్ వైద్య పరీక్షల శిబిరం

ప్రజాశక్తి -అనంతగిరి: కేన్సర్ కు గుర్తించేందుకు పరీక్షలు నిర్వహించేందుకు విజయవాడ నుండి ప్రత్యేక వైద్య నిపుణుల బృందం రానుందని స్థానిక వైద్యాధికారి జ్ఞానేశ్వరి పేర్కొన్నారు. ఈ నెల్ల 13న అనంతగిరి ఆరోగ్య కేంద్రం, 14న కాశిపట్నం సబ్ సెంటర్ సచివాలయం వద్ద కేన్సర్‌కు ఉచితంగా పరీక్షలు చేపడతామని, ఉదయం 10 గంటలకు రోగులు హజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చినుకు రాలితే జలమయం

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో శనివారం మధ్యాహ్నం నుంచి కురిసిన చిన్నపాటి వర్షానికి రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. చిలుకు రాలితే చాలు చెరువులుగా దర్శనమిస్తున్నాయి. అయినా పట్టించుకునే అధికారులు సైతం కరువయ్యారు. మండల కేంద్రంలో ప్రధానంగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద ఎదురుగా ఉన్న కాలనీకి వెళ్లే రోడ్డు వద్ద చెరువులు తలపించే విధంగా వర్షపు నీరుతో పాటు మురుగు నీరు నిలిచింది. నీరు ఎటూ ప్రవహించక పోవడంతో దుర్గంధం వెదజల్లడంతో కాలనీవాసులు ఇళ్లకు చేరేందుకు ఇబ్బందులు పడ్డారు.

మండల పరిస్థితి కార్యాలయం ఎదురుగా ప్రధాన రహదారిపై నీరు నిలిచి ఉండిపోవడంతో ప్రయాణికులు, వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పట్టించుకోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. గడిచిన రెండు సంవత్సరాలుగా అధికారులకు మొరపెట్టుకొన్నా పట్టించుకోలేదని, పలుమార్లు మండల పరిషత్ సమావేశాలలో సైతం అధికారులను నిలదీశామని ప్రజాప్రతినిధులు తెలిపారు.కూటమి ప్రభుత్వమైనా ఈ సమస్యలకు పరిష్కారం చూపాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.



కాలనీ వద్ద నిలిచిన నీరు



వేములవలస కూడలిలో రోడ్డుపై పడుకున్న కుక్కలు

‘భౌ’పెడుతున్నాయ్..

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలో పలుచోట్ల కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. వీధి కుక్కల నియంత్రణలో అధికారులు అలసత్వాన్ని ప్రదర్శిన్నారు, చిన్నాపెద్ద తేడా లేకుండా కుక్కలు ఎగబడి కరుస్తున్నా.. యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. కుక్కలు గుంపులు, గుంపులుగా రోడ్డుపై తిరుగుతూ చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు, సైకిల్, ద్విచక్రవాహనదారులపై పడుతున్నాయి. వీధికుక్కల స్వైర విహారంతో ప్రజలు బెంబేలెత్తు తున్నారు. రాత్రివేళల్లో దాడులు చేస్తుండటంతో కుక్కలు కనబడితే తీవ్రభయాందోళనకు గురవుతున్నారు. ప్రతిరోజూ ఎక్కడో ఒక చోట ఎవరో ఒకరు వీధి కుక్కల బారిన పడి గాయపడిన సంఘటన జరుగుతూనే ఉంది. వేములవలస జంక్షన్‌లో చేపలు, కోళ్లు, మేకల వ్యర్థాలను వ్యాపారులు వేస్తుండటంతో అక్కడ కుక్కలు ఎక్కువగా గుమిగూడుతున్నాయి. వేములవలస, లోడగలపాలెం ఎస్సీ కాలనీ, ఆనందపురం భూలోక మాత గుడి, ఆనందపురం, చందకవారి మిల్లి పూర్లవాని చెరువు, పొడుగుపాలెం ఎస్సీ కాలనీ, చందక జంక్షన్ తదితర ప్రాంతాలలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది.